# పొగ

నన్ను చూడడానికి వచ్చిన ఎనిమిదో వ్యక్తి బాలరాజు. అప్పటికే నాకు పెళ్ళిచూపు లంటే విసుగుపుట్టింది. పెళ్ళి కాకపోతేనేం అనుకున్న రోజులూ లేకపోలేదు. బి.యస్సీ, బి.ఇడి., పూర్తిచేసి ప్రైవేట్ స్కూల్లో పని చేస్తున్నాను. మేథ్స్ టీచర్‌నవడం వలన జీతంకన్నా ట్యూషన్ల మీద ఎక్కువ డబ్బులు వస్తుండేవి.

ఏ చీకూచింతా లేకుండా జీవితం గడిచిపోతుంటే వయసు మీదకు రావడం ఆగలేదు. ఇరవయ్యారో సంవత్సరంలోకి అడుగుపెట్టాక అమ్మా నాన్నా నా పెళ్ళి విషయమై తొందరపడడం మొదలెట్టారు.

వచ్చిన సంబంధాల్లో కొందరు నాకు నచ్చకపోవడం కన్నా వాళ్ళకు నేను నచ్చకపోవడం నాకు నచ్చిన విషయం. మేం పెద్దగా డబ్బున్నవాళ్ళేం కాము. సొంత ఇల్లు లేదు. నేను ఉద్యోగంలో చేరి నాలుగు రాళ్ళు సంపాయించే వరకు నెల చివరికొచ్చేసరికి తడుముకోవలసి వస్తుండేది. నా తర్వాత ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. చెల్లాయి బాగానే చదువుకుంటోంది. కాని తమ్ముడుకు చదువు వంటబట్టలేదు. నాన్న చిన్న ఉద్యోగి. అమ్మ హెూం మేకర్.

నన్ను చూడవచ్చిన కొందరు కట్నం ఎక్కువగానే అడిగారు. మాకంత స్థోమత లేదని చెప్పేశాం. మరికొందరు వెళ్ళాక ఉత్తరం రాస్తామన్నారు. అదొక సాకు. రాయరని మాకూ తెలుసు. నా పెళ్ళి అయి నేను కదిలితే కాని చెల్లాయి పెళ్ళి కాదు. కనీసం చెల్లాయి కోసమయినా నా పెళ్ళి కాక తప్పదు.

పెళ్ళిచూపుల్లో బాలరాజును చూశాను. మిగతావాళ్ళలా కాకుండా తనతో నలుగురయిదుగురిని వేసుకుని రాలేదు. ఒక్కడే వచ్చాడు. మనిషికి ముప్పయి ప్లస్ ఉంటాయి. సింపుల్‌గా చామనచాయకన్నా తక్కువగానే ఉన్నాడు. అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు. లావుగా ఏం లేదు. నేను చాపమీద కూర్చోబోతుంటే తన ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమన్నాడు. అక్కడికి అమ్మ చెల్లాయిని రానీయలేదు.

అతడు మా గురించి తెలుసుకునే వచ్చాడనుకుంటాను. నన్ను గాని నాన్నను గాని ఏ ప్రశ్న వేయలేదు. అతని గురించి నాన్నకు చూచాయగా తెలిసి ఉండాలి. నిర్ధారణ అవుతుందన్న నమ్మకం లేకపోవడం వలన వివరాలు తెలుసుకోవాలనిపించి ఉండదు. అప్పుడతను ఏదయినా మాట్లాడితే బావుండనిపించింది.

"మీరొక్కరే వచ్చారు" అన్నాడు నాన్న.

అతను దీర్ఘంగా నిట్టూర్చి, "నాకెవరూ లేరు. అనాథను. స్నేహితులెవరినీ తీసుకురావాలనిపించలేదు" అన్నాడు.

అయినా ఒక్కడే రావడం చిత్రంగా అనిపించింది. మరోవిధంగా మంచిదే అని కూడా అనిపించింది.

"ఏం చదువుకున్నారు?" అమ్మ అడిగింది.

"ఐటిఐలో డిప్లొమా చేసి గత పదేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నాను."

"ఇప్పుడేం చేస్తున్నారు?"

"చార్జిమేన్‌గా చేస్తున్నాను."

"ఉద్యోగం పర్మనెంటే కదా?"

"పర్మనెంటేనండీ. నేను పనిచేస్తోంది కేంద్ర ప్రభుత్వ సంస్థలోనండీ..."

"జీతం ఎంతిస్తారు?"

చెప్పాడు. మాటలు సౌమ్యంగా ఉన్నాయి.

నమ్మలేనట్టు అమ్మ నాన్న వంక చూసింది.

తను పనిచేస్తున్న కంపెనీ పేరు చెప్పి, "మా కంపెనీ పేరు వినే ఉంటారు. మాకు క్వార్టర్స్ ఇచ్చారు. చాలా సదుపాయాలున్నాయి" అన్నాడు.

వాళ్ళ కంపెనీకి మంచి పేరుంది. నేనూ విన్నాను.

తర్వాత అరగంటేమో కూర్చున్నాడు. అతను మమ్మల్ని అడిగిన ప్రశ్నలకన్నా మేమడిగిన ప్రశ్నలే ఎక్కువగా ఉన్నాయి. అతను వెళ్తూ తన విజిటింగ్ కార్డు నాన్నకు ఇచ్చి, "మీరు నా గురించి ఎంక్వైరీ చేశాక ఇష్టమయితే నాకు ఫోన్ చేయండి" అన్నాడు.

అతను వెళ్ళిపోతూ నా కళ్ళల్లోకి చూసిన చూపు చాలాసేపు వెంటాడింది.

అరగంట తర్వాత అమ్మ నా ఉద్దేశం అడిగినప్పుడు... "అన్నీ ఉన్న అతనికి ఇంతవరకు ఎందుకు పెళ్ళి కాలేదు?" సందేహం వెలిబుచ్చాను.

"తెలుసుకుందాం" అంది అమ్మ.

నాన్నే స్వయంగా వెళ్ళి అతని గురించి తెలుసుకున్నాక నెల తిరగకుండానే మా పెళ్ళి జరిగింది.

బాలరాజు నేను ఊహించినదానికన్నా మంచివాడు. నా అంత అదృష్టవంతురాలు మరొకరుండరని అనిపించేది. నేనే ఎప్పుడయినా అతని మీద కోప్పడేదాన్ని. అతను పొరపాటుగానయినా నన్నో మాట అనేవాడు కాదు. మా ఎనిమిది సంవత్సరాల జీవితంలో ఇద్దరు పిల్లల్ని కనడం నేనేగాని పెంచింది అతనే.

నా కళ్ళవెంట ఏనాడూ నీటి చుక్క రానీయకుండా చూసుకున్నాడు.

కంపెనీలో జరిగిన ప్రమాదంలో తన సహోద్యోగిని రక్షించబోయి బాలరాజు చనిపోయాడు. నేను నేను కావడానికి మూడు రోజులు పట్టింది. చివరి చూపులు చూడడానికి నోచుకోలేకపోయాను. కాలి మసి అయిపోయాడు.

కంపాషనేట్ గ్రవుండ్స్‌లో నాకు వాళ్ళ కంపెనీలో నా క్వాలిఫికేషన్‌కు తగిన ఉద్యోగం ఇచ్చారు. రెండు నెలల తర్వాత గాడిలో పడ్డాను.

బాలరాజుకు మంచి పేరుంది. ఎంతోమంది స్నేహితులున్నారు. అతను చనిపోయిన కొత్తలో చాలామంది వచ్చి నన్ను ఓదార్చేవారు. కొంతమంది నాకూ పిల్లలకు తినడానికి ఏమయినా తీసుకొచ్చేవారు. ఫోన్లమీద ఫోన్లు వస్తుండేవి. కండొలెన్స్ మెసేజ్‌లు చాలా వచ్చాయి. క్రమక్రమంగా అన్నీ తగ్గిపోయాయి. అతని దగ్గర స్నేహితులు తర్వాత రావడం మనేశారు. బయట ఎక్కడయినా కనిపిస్తే పొడిపొడిగా మాట్లాడేవారు. నా జీవింతంలో నేను మునిగిపోయాను.

రోజులు చిన్నవయి నెలలు దాటి అతను చనిపోయిన రోజు వచ్చింది. సంస్మరణ కూటమికి మా సెక్షను వాళ్ళనూ, తెలిసిన వాళ్ళనూ ఆహ్వానించాను. ఆఫీసుకు సెలవు తీసుకున్నాను.

ఉదయం ఎనిమిదింటికి ముందే తయారయి మా తోటలోని పూలన్నీ కోసే బొకేగా కట్టాను. ఎందుకంటే మా టవున్‌షిప్‌లో అంత ఉదయాన్నే పూల దుకాణాలు తెరవరు. పిల్లల్ని స్కూలుకు పంపి పూలగుత్తిని ప్లాస్టిక్ సంచిలో పెట్టుకుని, కొవ్వొత్తులు, సాంబ్రాణి కడ్డీలు, అగ్గిపెట్టె వేరే సంచిలో పెట్టుకుని, రానూపోనూ ఆటో మాట్లాడుకుని బయల్దేరేసరికి తొమ్మిది దాటింది.

సమాధుల తోట మా టవున్‌షిప్‌కు దూరంలోనే ఉంది. మా క్వార్టర్స్ నుంచి నాలుగున్నర కిలోమీటర్లు ఉంటుంది.

ఎండాకాలం మొదలుకాకపోయినా ఆ సమయానికి ఎండ చురుక్కుమంటోంది. సమాధుల తోట ప్రహరీగోడ తలుపు దగ్గర రిక్షా ఆపించి రిక్షా దిగాను. సమాధులు దాటుకుంటూ చివరికొచ్చి బాలరాజు సమాధి మీద పూలగుత్తి పెట్టబోతూ ఆగాను. నాకంటే ముందే అక్కడికి ఎవరో వచ్చారు. మార్బుల్ రాళ్ళు నీటితో శుభ్రం చేయబడి ఉన్నాయి. కొవ్వొత్తి వెలుగుతోంది. సమాధిమీద ఎర్రటి రిబ్బనుతో కట్టిన గులాబీ

పూలగుత్తి ఉంది. రిబ్బను చివర చిన్న కాయితం ఉంది. చేతిలోకి తీసుకున్నాను. ఆ కాయితం మీద ఇలా ఉంది : "నాకూ బాలరాజు గుర్తున్నాడు. మరిచిపోలేకపోతున్నాను."

బాల్‌పెన్‌తో రాసిన అక్షరాలు గుండ్రంగా చక్కగా ఉన్నాయి. కింద పేరు లేదు.

*'చినుకు' మాసపత్రిక, జూలై - 2012*